ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 14 జూలై 2024



అన్నియూరు శివా

విక్రవాండి డీఎంకేదే

- విజేత అన్నియూరు శివకు 20 రౌండ్లలోనూ ఆధిక్యం
- 27మంది అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు
- మా మూడేళ్ల పాలనపై ప్రజలిచ్చిన తీర్పు : స్టాలిన్
- ఈ ఎన్నికతో ప్రజాస్వామ్యం అపహాస్యం : అన్బుమణి



పార్టీ శ్రేణులకు లడ్డూలు పంచిపెడుతున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికలో మళ్లీ డీఎంకేనే విజయ ఢంకా మోగించింది. అక్కడ ఆ పార్టీ అభ్యర్థి అన్నియూరు శివ ఘన విజయం సాధించారు. తన సమీప పీఎంకే అభ్యర్థి అన్బుమణి కంటే 67 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం చాటారు. ఈ ఎన్నికల్లో నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి సహా మొత్తం 27 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. విక్రవాండి శాసనసభ్యుడు ఎన్.పుహళేంది అనారోగ్య కారణాల వల్ల మృతి చెందడంతో ఈ నియోజకవర్గానికి ఈనెల 10న ఉపఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. డీఎంకే తరఫున అన్నియూరు శివ, పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి అభినయ సహా 29 మంది పోటీ చేశారు. ఎన్నికల్లో 82.47 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గంలోని 2,37,031 మంది ఓటర్లకుగాను 1,95,495 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను పనయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలకు తరలించి ఏజెంట్లు, అధికారుల సమక్షంలో సీలు వేశారు. ఆ తర్వాత గత రెండు రోజులుగా స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసులు మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. విల్లుపురం జోన్ డీఐజీ దిశా మిట్టల్, డీఎస్పీ దీపక్ శివాంష్ నాయకత్వంలో నలుగురు ఏడీఎస్పీలు, ఏడుగురు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు, 28 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు సహా సుమారు 1500 మంది పోలీసులు భద్రతా విధులు నిర్వర్తించారు. ఇక పార్టీల ఏజెంట్లు, అభ్యర్థుల ఏజెంట్లు కూడా స్ట్రాంగ్ రూంల వద్ద పర్యవేక్షిస్తూ వచ్చారు.

కౌంటింగ్ సెంటర్‌కు

ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు పనులు ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకు స్ట్రాంగ్ రూంల నుంచి ఈవీఎంలను కౌంటింగ్ బల్లల వద్దకు తరలించారు. అభ్యర్థుల ఏజెంట్లు, కౌంటింగ్ ఉన్నతాధికారులు, పర్యవేక్షకుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలుత తపాలా ఓట్లను లెక్కించారు. అటు పిమ్మట ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించారు. ఈ లెక్కింపు పనుల్లో 14 మంది గ్రామ సహాయకులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మొత్తం 150 మంది సిబ్బంది కౌంటింగ్ డ్యూటీ చేశారు. 14 బల్లలపై ఉంచిన ఈవీఎంలలో నమోదైన ఓట్లను వరుసగా లెక్కిస్తూ వచ్చారు.

తొలి రౌండ్ నుంచే

ఉదయం 9.30 గంటలకు తొలి రౌండ్ కౌంటింగ్ ముగిసింది. ఆ కౌంటింగ్‌లో డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివాకు 8565 ఓట్లు, పీఎంకే అభ్యర్థి అన్బుమణికి 3906 ఓట్లు, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి డాక్టర్ అభినయకు 303 ఓట్లు లభించాయి. రెండో రౌండ్‌లో శివాకు 12,002, అన్బుమణికి 5904 ఓట్లు, అభినయకు 819 ఓట్లు లభించాయి. ఇలా 20 రౌండ్ల దాకా డీఎంకే అభ్యర్థి శివా సమీప ప్రత్యర్థులపై ఆధిక్యం సాధిస్తూ వచ్చారు. మొత్తం 20 రౌండ్లు ముగియడంతో ఫలితాన్ని ఎన్నికల అధికారులు తెలిపారు. డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా తన సమీప ప్రత్యర్థి అన్బుమణి కంటే 67,169 ఓట్ల ఆధిక్యంతో గెలిచినట్లు ప్రకటించారు. శివాకు 1,23,195ఓట్లు, అన్బుమణికి 67,169 ఓట్లు, అభినయకు 10,479ఓట్లు పోలైనట్లు పేర్కొన్నారు.

అరివాలయంలో సంబరాలు...

విక్రవాండి ఓట్ల లెక్కింపునకు ఇంకా మూడు రౌండ్లు మిగిలి ఉండగానే డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. వేలసంఖ్యలో పార్టీ కార్యకర్తలు గుమికూడి టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. అదే సమయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లడ్డూలను, మిఠాయిలను పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... తమ మూడేళ్ల పాలనపై సంతృప్తి చెందిన విక్రవాండి ఓటర్లు చక్కటి తీర్పు వెలువరించారని తెలిపారు. ఆ తర్వాత సీనియర్ మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు తదితర నేతలు స్టాలిన్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

నకిలీ గుర్తింపు కార్డుతో చొరబాటు...

విక్రవాండి ఓట్ల లెక్కింపు సమయంలో ఓ వ్యక్తి నకిలీ గుర్తింపుకార్డుతో చొరబడ్డాడు.పోలీసులు అప్రమత్తమై అతనిని అరెస్టు చేశారు. తపాలా ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంలలో ఓట్లు లెక్కింపు ప్రారంభమైనప్పుడు ఆ వ్యక్తి కౌంటింగ్ ప్రాంతానికి చేరువగా సంచరించాడు. వెంటనే పోలీసులు అతడి వద్దనున్న గుర్తింపు కార్డును పరిశీలించి అది నకిలీదని నిర్ధారించారు. ఆ తర్వాత ఆ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు.

నిజాయితీ పాలనపై చక్కటి తీర్పు...

విక్రవాండిలో డీఎంకే అభ్యర్థి గెలుపు రాష్ట్రంలో మూడేళ్లకు పైగా కొనసాగుతున్న స్టాలిన్ నిజాయితీ పాలనపై ప్రజలిచ్చిన చక్కటి తీర్పు అని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి అన్నారు. అరివాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని సీట్లలో ఇండియా కూటమి గెలవడంతో విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపు ఖాయమనే భావించామని, అయితే మెజారిటీ ఎంత వస్తుందనే విషయంపై ఎదురుచూశామన్నారు. అనుకున్నట్లే 67 వేల ఓట్ల పైచిలుకు ఓట్లతో తమ పార్టీ అభ్యర్థి గెలవడం ఆనందంగా ఉందన్నారు.

ప్రజాతీర్పు కాదు : అన్నామలై

విక్రవాండిలో డీఎంకే గెలుపును ఆ పార్టీ పాలనపై ప్రజలిచ్చిన తీర్పుగా భావించకూడదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. ఆ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ.. విక్రవాండిలో అధికార పార్టీ ఓటర్లకు నగదు, కానుకలను విపరీతంగా పంచిపెట్టి గెలిచిందన్నారు. అధికారబలం, అంగబలం ఉపయోగించి విక్రవాండిని డీఎంకే కైవశం చేసుకుందన్నారు. పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ మాట్లాడుతూ.. విక్రవాండి ఉప ఎన్నికలో అధికార డీఎంకే అక్రమాలకు పాల్పడడం ద్వారా ప్రజాస్వామ్యం అపహాస్యమైందన్నారు. ఓట్లరకు విచ్చలవిడిగా నగదు, కానుకలు పంచిపెట్టిందన్నారు. పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ వ్యాఖ్యానిస్తూ... డీఎంకేకు ఇది తాత్కాలిక గెలుపు మాత్రమేనని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇండియా కూటమికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.



అస్వస్థతకు గురవడానికి ముందు స్టాలినకు శుభాకాంక్షలు చెబుతున్న దురైమురుగన్

మంత్రి దురైమురుగన్‌కు అస్వస్థత

- ఆసుపత్రిలో చికిత్స

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి దురైమురుగన్ అస్వస్థతకు గురై, ఆసుపత్రిలో చేరారు. శనివారం మధ్యాహ్నం ఆయన విక్రవాండి ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపొందటంతో తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లారు. పార్టీ నిర్వాహకులతో మాట్లాడుతూ హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. రక్తంలో చక్కెర శాతం ఉన్నట్టుండి తగ్గటంతో ఆయన మూర్ఛిల్లారు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యనిపుణులు ఆయనకు పరీక్షలు జరిపి చికిత్సలందిస్తున్నారు. 86 ఏళ్ల దురైమురుగన్ ఇటీవల కూడా స్వల్ప అస్వస్థతకు గురై వెంటనే కోలుకున్న విషయం తెలిసిందే.

చెన్నైలో అదానీ బృందం!

- నాలుగురోజుల క్రితం నగరంలో పర్యటన
- పరందూర్ విమానాశ్రయం, కాట్టుపల్లి ఓడరేవు పనులపై ఉన్నతాధికారులతో చర్చలు!



పెరంబూర్, జూలై 13: కొత్తగా నిర్మించతలపెట్టిన కాంచీపురం జిల్లాలోని పరందూర్ విమానాశ్రయం, కాట్టుపల్లి ఓడరేవు విస్తరణ పనుల్ని గుజరాత్‌కు చెందిన పారిశ్రామికవేత్త గౌతం అదానీ సొంతం చేసుకోనున్నారా?.. ఇందుకు సంబంధించి ఆయన నేరుగా చెన్నై వచ్చి ప్రభుత్వ యంత్రాంగంతో మంతనాలు జరిపారంటూ ఓ ప్రముఖ తమిళ పత్రిక కథనం వెలువరించింది.దాని ప్రకారం నాలుగు రోజుల క్రితం అహ్మదాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకున్న అదానీ.. ముఖ్యమైన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జనవరిలో నగరంలో జరిగిన పెట్టుబడిదారుల మహానాడులో అదానీ సంస్థ రాష్ట్రంలో రూ.42,768 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకుంది. ఈ నేపథ్యంలో గౌతం అదానీ, అదానీ సంస్థ నిర్వహణ డైరెక్టర్, ఆయన సోదరుడు రాజేష్ శాంతిలాల్ అదానీ, ఆయన కుమారుడు కరణ్ అదానీ (అదానీ ఓడరేవుల సీఈఓ) తదితరులు ప్రత్యేక విమానంలో చెన్నైకి చేరుకున్నారు. వారంతా స్థానిక తేనాంపేట చిత్తరంజన్ రోడ్డు ప్రాంతానికి వెళ్లారు. అదే ప్రాంతంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాసం కూడా ఉంది. కానీ, వారు సీఎంను కలుసుకున్నారా, లేదా అనే విషయంపై స్పష్టత లేదు.వెళ్లే ముందు ఈసీఆర్‌లోని ఓ స్టార్ హోటల్లో డిన్నర్ చేశారు. అదానీ సంస్థ ప్రస్తుతం రాష్ట్రంలో రామనాథపురంలో 700 మెగావాట్ల సౌరశక్తి విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు కాట్టుపల్లి ఓడరేవు అభివృద్ధికి పెట్టుబడులు పెట్టింది. అవి మినహా పరందూర్ విమానాశ్రయం అభివృద్ధి, ఇప్పటికే కాంట్రాక్ట్ దక్కించుకున్న కాట్టుపల్లి ఓడరేవు విస్తరణ తదితరాలపై అదానీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. పరందూర్ విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ భూసేకరణ పనులు చేపట్టింది. ఈ నిర్మాణాలను ప్రైవేటు సహకారంతో ప్రభుత్వాలు చేపట్టనున్నాయి. భూసేకరణ ప్రభుత్వం చేపట్టనుండగా, నిర్మాణాలకు సంబంధించిన పెట్టుబడులు ప్రైవేటు సంస్థ అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టును చేజిక్కించుకొనేందుకు అదానీ సంస్థ ఆసక్తి చూపుతోందని తమిళపత్రిక కథనంలో పేర్కొంది.


ప్రశాంతంగా.. గ్రూప్-1 పరీక్ష

- 797 కేంద్రాల్లో 2 లక్షల మంది హాజరు



నుంగంబాక్కంలోని పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 90 పోస్టులకు గాను శనివారం నిర్వహించిన టీఎన్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు సుమారు 2 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. 16 సబ్‌కలెక్టర్ పోస్టులు, 23 డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ పోస్టులు, 14 ఐటీ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు, 21 సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు, 14 గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకులు తదితర పోస్టులను భర్తీ చేయడానికి ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రకటన మార్చి 28న వెలువడింది. 2,38,247 మందిని పరీక్షలు రాసేందుకు అనుమతించారు. రాష్ట్రవ్యాప్తంగా 797 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాజధాని నగరం చెన్నైలో 124 కేంద్రాల్లో సుమారు 37 వేలమంది పరీక్ష రాశా రు. శనివారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకూ ఈ పరీక్ష కొనసాగింది. మొత్తం 200 మార్కులకు తమిళం, ఆంగ్లంలో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్లు, గడియారాలను అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు మెయిన్స్ రాయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మౌఖిక పరీక్షలోనూ ఉత్తీర్ణులయితేనే ఉద్యోగ నియామకాలు జారీ చేస్తారని టీఎన్‌పీఎస్సీ అధికారులు పేర్కొన్నారు.



ట్రిప్లికేన్ ఎన్‌కేటీ స్కూలు వద్ద పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

బడిపిల్లల అల్పాహార పథక విస్తరణకు

రేపు తిరువళ్లూర్ జిల్లాలో సీఎం శ్రీకారం



ప్యారీస్, జూలై 13: దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 122వ జయంతి పురస్కరించుకొని బడిపిల్లల అల్పాహార పథకం విస్తరణ కార్యక్రమానికి ఈనెల 15న సోమవారం తిరువళ్లూర్ జిల్లాలో ముఖ్యమంత్రి స్టాలిన్ శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని కీలచ్చేరిలో ఉన్న సెయింట్ అన్నాల్ ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలలో రాష్ట్రప్రభుత్వం తరపున కామరాజర్ జయంతి వేడులకు జరుపుకొనేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు సీఎం ఉదయం అల్పాహార పథకం అమలులో ఉంది. ఈ పథకాన్ని తొలుత 1,545 పాఠశాలల్లో లాంఛనంగా ప్రారంభించగా, 1.14 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహార పథకానికి రాష్ట్రప్రజల నుంచి ఆదరణ పెరిగింది. ఈ పథకం విజయవంతంగా అమలు జరుగుతున్న కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కలిగిన ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకొని గత సంవత్సరం ఆగస్టు 25వ తేది దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జన్మస్థలమైన తిరుకువళైలో ఈ పథకాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలకు విస్తరించారు. ఆ కారణంగా 30,992 ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 18.50 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో, ఇప్పటివరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే అమలు జరుగుతున్న ఈ పథకాన్ని ఎయిడెడ్ పాఠశాలలకు విస్తరించనున్నట్టు సీఎం ప్రకటించారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేది కామరాజర్ 122వ జయంతిని పురస్కరించుకొని తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ పంచాయతి కీలచ్చేరిలో ఉన్న సెయింట్ అన్నాల్ ఎయిడెడ్ పాఠశాలలో సీఎం స్టాలిన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3,995 ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 2,23,536 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సీబీసీఐడీ దాడులు కొనసాగితే రాష్ట్రవ్యాప్త ఆందోళన

ఈపీఎస్ హెచ్చరిక

ప్యారీస్, జూలై 13: రాజకీయ కక్షలో భాగంగా తమ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, పార్టీ నాయకుల ఇళ్లు, కార్యాలయాల్లో సీబీసీఐడీ దాడులు కొనసాగించడాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఈ నెల 10వ తేది నుంచి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఓటమి గల కారణాలను తెలుసుకొనేలా పళనిస్వామి అధ్యక్షతన సమీక్షా సమావేశాలు జరుగుతున్నాయి. రోజుకు మూడు నియోజకవర్గాల పార్టీ జిల్లా కార్యదర్శులు, ప్రధాన నిర్వాహకులతో ఈపీఎస్ సమావేశమై ఎన్నికల ఓటమికి గల కారణాలు, వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటున్నారు. నాల్గో రోజైన శనివారం కడలూరు జిల్లా చిదంబరం నియోజకవర్గ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న నేతలు... లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై దృష్టి సారించకుండా కొంతమంది నాయకులు నిర్లక్ష్యం చూపారని మండిపడ్డారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... 18వ లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఊహించిన విజయం సాధించలేదని అయినా, భవిష్యత్తులో విజయమే లక్ష్యంగా పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయనున్నట్లు తెలిపారు. పొత్తుల గురించి పార్టీ నిర్వాహకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి సూచించినట్లు తెలిపారు. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో డీఎంకే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సీబీసీఐడీ అధికారులు దాడులు కొనసాగించడాన్ని ఈపీఎస్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తున్న ప్రతిపక్షాల నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ వారిని అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తోందని, ఇది స్టాలిన్ నిరంకుశాధికారానికి నిదర్శనమన్నారు. మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్‌ను హత్యా నేరస్తుడిగా భావిస్తూ వందలాదిమంది పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారని, విచారణ పేరుతో కరూర్ జిల్లా అన్నాడీఎంకే నిర్వాహకులను హింసిస్తున్నారని ఆరోపించారు. సీబీసీఐడీ అధికారుల వైఖరిని ఖండిస్తూ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.



ఎడప్పాడికి స్వాగతం పలుకుతున్న నేతలు

కర్ణాటక ప్రభుత్వ తీరును ఖండిస్తూ రైతుల ఆందోళన

పెరంబూర్, జూలై 13: కావేరి జలాలు విడుదల చేసేందుకు నిరాకరించిన కర్ణాటక ప్రభుత్వ తీరును నిరసిస్తూ తంజావూరులో రైతులు ఆందోళన చేపట్టారు. తమిళనాడుకు ఈ నెలాఖరు వరకు ప్రతిరోజూ టీఎంసీ నీరు అందించాలని కావేరి నీటి నిర్వాహక మండలి జారీ చేసిన ఉత్తర్వులను కర్ణాటక ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రస్తుతం తమ రాష్ట్రంలోని డ్యాంల్లో 28 శాతం నీరు తక్కువగా ఉందని, అందువల్ల తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయడం సాధ్యం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో, కర్ణాటక ప్రభుత్వ సత్వరం రాష్ట్రానికి నీరు విడుదల చేయాలని, నీరు లేక పంటలు కోల్పోయిన డెల్టా జిల్లాల రైతులకు రూ.లక్ష కోట్లు అందించాలని డిమాండ్ చేస్తూ తంజావూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. దక్షిణ భారత నదుల అనుసంధాన రైతుల సంఘం అధ్యక్షుడు అయ్యాకన్ను నేతృత్వంలో రైతులు కుండలు చేతబట్టి కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడే రోడ్డుపై భైఠాయించిన రైతులు కర్ణాటక, కేంద్ర ప్రభుత్వాల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు.



రోడ్డుపై కుండలతో రైతుల ఆందోళన

సమాచార దర్శిని

ఐటీఐ దరఖాస్తుల గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 13: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశ కౌన్సెలింగ్ గత నెల 28వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా 8,10 తరగతులు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు ఈ నెల 15వ తేది వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆ గడువు ఈ నెల 31వ తేది వరకు పొడిగించారు.

కావేరి నదిపై కొత్త వంతెన

ఐసిఎఫ్, జూలై 13: తిరుచ్చి సమీపంలో కావేరి నదిపై రూ.106 కోట్లతో కొత్త వంతెన నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన, భూమి పూజ జరిగాయి. తిరుచ్చి చింతామణి నుంచి తిరుచ్చి నగరాన్ని శ్రీరంగంతో అనుసంధానం చేసేలా నిర్మించిన ఇనుప వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 1976లో కావేరి నదికి అడ్డుగా వంతెన నిర్మించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ వంతెన కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త వంతెన నిర్మించనున్నారు. 18 నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

సాతానుకాడు జలాశయంలో పక్షుల శరణాలయం

ఐసిఎఫ్, జూలై 13: స్థానిక తిరువొత్తియూర్ మండలంలోని సాతానుకాడు జలాశయాన్ని పక్షుల శరణాలయంగా మార్చనున్నట్లు అధికారులు తెలిపారు. మనలి సీపీసీఎల్ సంస్థ సమీపంలో 100 ఎకరాల్లో సాతానుకాడు జలాశయం విస్తరించి ఉంది. ఈ జలాశయాన్ని ప్రైవేటు సంస్థలు ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులందడంతో, చుట్టుపక్కల చిత్తడి భూమి కలిగిన ఈ జలాశయాన్ని పక్షుల శరణాలయంగా మార్చేందుకు కార్పొరేషన్ నిర్ణయించింది. శరణాలయంలో పాటు పార్క్ కూడా ఏర్పాటు చేయనుంది.

చెన్నై - శ్రీలంక లగ్జరీ నౌకా సేవలు ప్రారంభం

ప్యారీస్, జూలై 13: చెన్నై - శ్రీలంక మధ్య లగ్జరీ నౌకా సేవలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్యారీస్ సమీపంలోని హార్బర్ పోర్టులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక టెర్మినల్‌లో కస్టమ్స్ శాఖ, వీసా శాఖ కార్యాలయాలు ఆధునిక వసతులతో చెన్నై - శ్రీలంక మధ్య విహారయాత్రకు లగ్జరీ నౌకా సేవలు ప్రారంభమయ్యాయి. 1,220 మంది పర్యాటకులు, 448మంది సిబ్బంది ప్రయాణించవచ్చు. ఎంవీఎం ప్రెస్ అనే ఈ నౌక ప్రస్తుతం చెన్నై హార్బర్‌కు వచ్చి చేరింది. పోర్ట్ ఛైర్మన్ సునీల్‌పాలీవాల్, వైస్ ఛైర్మన్ ఎస్.విశ్వనాథన్ తదితరులు ఈ నౌకలో వచ్చిన వారిని ఘనంగా స్వాగతించారు.

తాగేందుకు డబ్బులివ్వలేదని పెయింటర్ ఆత్మహత్య

వేలూరు, జూలై 13: మద్యం తాగేందుకు డబ్బులివ్వకపోవడంతో మనస్తాపం చెందిన పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక కాట్పాడి సమీపం టీకే పురం గ్రామానికి చెందిన పెయింటర్ బాబు (42)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటికొచ్చిన బాబు, మద్యం తాగేందుకు డబ్బులివ్వాలంటూ భార్యను కోరడంతో ఆమె నిరాకరించింది. దీంతో ప్రాంగణంలోని జామ చెట్టుకు ఉరేసుకున్నాడు. విరుదంబట్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పిడుగుపాటుకు రైతు మృతి

పెరంబూర్, జూలై 13: శివగంగ జిల్లా కారైక్కుడి, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం భారీవర్షం కురిసింది. వేలాయుధ పట్టణ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉంటూ వ్యవసాయ పనులు చేపడుతున్న సుబ్రమణి పక్కనే పిడుగు పడడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. అలాగే, సుబ్రమణితో పనిచేస్తున్న పళని స్వామికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు పళని స్వామిని సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అతని పరిస్థితి విషయంగా ఉందని పోలీసులు తెలిపారు.

ప్రకటన బోర్డు కూలి పడి అసోం మహిళ మృతి

ప్యారీస్, జూలై 13: స్థానిక తరమణి 100 అడుగుల రోడ్డులో ఉన్న ప్రకటన బోర్డు గాలివానతో కూలిపడడంతో అసోంకు చెందిన ఓ మహిళ మృతి చెందడం పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అసోంకు చెందిన విష్ణు భార్య రేణుక (30) తరమణిలో ఉన్న డీఎల్ఎఫ్ కంపెనీలో రెండు నెలలు గా హౌస్ కీపింగ్ పనులు చేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి కార్యాలయం నుంచి ఆమె ఇంటికి బయల్దేరారు. భారీగా కురిసిన వర్షానికి గాలి తోడుకావడంతో ఆమె వేగంగా నడిచి వెళుతున్న సమయంలో 100 అడుగుల రోడ్డులో ఉన్న ప్రకటన బోర్డు కూలి ఆమెపై పడింది. ఇందులో తీవ్రంగా గాయపడిన రేణుకను సమీపంలో ఉన్న వారు రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఆమె మరణించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.53 లక్షల హవాలా నగదు స్వాధీనం



పెరంబూర్, జూలై13: రామ నాథపురం జిల్లా పరమకుడి ప్రాంతం లో ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.53 లక్షల హవాలా నగదు స్వాధీనం చేసుకు న్నారు. పరమకుడి ఇళయాంగుడి రోడ్డు గాంధీ నగర్ చెక్‌పోస్టులో శనివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మోటరు సైకిల్‌పై వచ్చిన వ్యక్తుల బ్యాగు తనిఖీ చేయగా, అందులో కట్టలు కట్టలుగా రూ.52,92,200 నగదు గుర్తించారు. ఆ వ్యక్తి శివగంగ జిల్లాకు చెందిన ప్రభాకరన్, కవిదాస్‌అని తెలిసింది. చెన్నై నుంచి ఈ నగదు తీసుకొస్తున్నారని, 10 రోజులకు ఒకసారి డబ్బులు పంపుతుంటారని, ఆ నగదును సంబంధిత వ్యక్తికి వీరు అందజేస్తారని విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు.

ఇద్దరు రౌడీల అరెస్ట్

ప్యారీస్, జూలై 13: గ్రేటర్ చెన్నై పోలీసులు పేరుమోసిన ఇద్దరు రౌడీలను అరెస్ట్ చేశారు. రాజధాని నగరంలో రౌడీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా కొత్తగా పదవీబాధ్యతలు చేపట్టిన పోలీస్ కమిషనర్ అరుణ్ చర్యలు చేపట్టారు. నేరాలు పరిగణలోకి తీసుకొని రౌడీలను ఏ, బీ, సీ, డీలుగు విభజించి చిట్టా తయారు చేశారు. జైలు నుంచి విడుదలైన రౌడీల కదలికలు పర్యవేక్షించేలా నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతానికి చెందిన ఏ కేటగిరీకి చెందిన కోచ్ కుమరన్, బబ్లూ షణ్ముగంను శనివారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేసేందుకు యత్నించారు. అప్పుడు తప్పించుకొనే ప్రయత్నంలో కాలుజారి కిందపడిన ఈ రౌడీల కుడిచేతి ఎముక విరిగినట్లు పోలీసులు తెలిపారు.

సారా నేరస్థులకు ఇక కఠిన శిక్షలే : సీఎం స్టాలిన్



చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సారా విక్రేతలు, తయారీదారులకు కఠిన శిక్షలు పడేలా గత జూన్ 29న శాసనసభలో నెరవేర్చిన మద్యపాన సవరణ చట్టం అమల్లోకి వచ్చిందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో ఆమోదించిన ఈ బిల్లుకు ఈ నెల 11న గవర్నర్ ఆమోదం తెలిపారని, ఇకపై సారా నేరస్థులకు కటకటాలే అంటూ ఆయన తెలిపారు. కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటన తర్వాత తాను సారా విక్రయించేవారు, తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ప్రకటించానని, ఆ మేరకు మద్యపాన నిషేధ చట్టం సవరణ ప్రకారం సారాకు సంబంధించిన వివిధ నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధిస్తామన్నారు. 1937 రాష్ట్ర మద్యనిషేధ చట్ట సవరణ ప్రకారం ఇకపై లీటరుకు పైగా చట్ట వ్యతిరేకంగా మద్యాన్ని దిగుమతి లేదా ఎగుమతి చేసినా, రవాణా చేసినా, చట్ట వ్యతిరేకంగా మద్యం తయారు చేసినా, చట్ట వ్యతిరేకంగా మద్యపాన కర్మాగారం (డిస్టిలరీ) లేదా బ్రేవరీలు జరిపినా, చట్ట వ్యతిరేకంగా ప్లాస్టిక్ సంచుల్లో విక్రయించినా ఇకపై మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. అంతే కాకుండా రూ. రెండు లక్షల నుంచి రూ. మూడు లక్షల దాకా జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇదే విధంగా 50 లీటర్లకు పైగా 100 లీటర్ల దాకా చట్ట వ్యతిరేకంగా మద్యాన్ని ఎగుమతి లేదా దిగుమతి లేదా అక్రమంగా రవాణా చేసినా, లేక నిల్వ ఉంచినా రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించి, రూ.లక్ష నుంచి రూ.2 లక్షలదాకా జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఇక 40 లీటర్ల దాకా చట్ట వ్యతిరేకంగా మద్యాన్ని ఎగుమతి లేదా దిగుమతి చేసినా, లేక దాచినా, చట్ట వ్యతిరేకంగా మద్యాన్ని తాగినా, కొనుగోలు చేసినా, లైసెన్సులేని ప్రాంతాల్లో మద్యం విక్రయించినా సవరించిన చట్టం ప్రకారం యేడాది నుండి మూడేళ్లదాకా జైలు శిక్ష, రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా జరిమానా విధిస్తారు. స్వదేశంలో తయారయ్యే విదేశీ మద్యం, విదేశాల నుంచి తెప్పించిన మద్యం, పండ్లతో తయారైన మద్యాన్ని దాచినా, అక్రమంగా రవాణా చేసినా ఇకపై యేడాది జైలు శిక్ష లేదా రూ.25 వేల నుంచి రూ.50 వేల దాకా జరిమానా విధిస్తామన్నారు. ఇక మద్యం సేవించడం వల్ల ప్రాణాలకు ముప్పువాటిల్లేలా చట్ట వ్యతిరేక మద్యపానానికి (కల్తీసారా తయారీ, విక్రయం) సంబంధించిన నేరాలకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్ష రూ.10లక్షల జరిమానా విధిస్తారని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రాణానికి ముప్పు కలిగించని, అదే సమయంలో ఆరోగ్యపరంగా హాని కలిగించే మద్యాన్ని తాగించడం, విక్రయించడం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే నేరాలకు ఇకపై ఐదు నుంచి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల దాకా జరిమానా విధిస్తారని తెలిపారు. ప్రజలు తాగేందుకు వినియోగించే మద్యంలో స్పిరిట్ కలిపి విక్రయించడం, అక్రమంగా రవాణా చేయడం వంటి నేరాలకు సవరించిన చట్టం ప్రకారం మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.2లక్షల నుంచి రూ.3 లక్షలదాకా జరిమానా విధిస్తారు. లైసెన్సులేని చోట మద్యం తాగేందుకు అనుమతించే బార్లకు ప్రభుత్వం సీజ్ చేస్తుందన్నారు. మద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రకటనలు చేసే నేరానికి ఇకపై రెండు నుంచి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష నుండి రూ.2లక్షల దాకా జరిమాన విధిస్తారని స్టాలిన్ ఆ ప్రకటనలో వివరించారు. సవరించిన మద్యపాన చట్టం ప్రకారం సారా వ్యాపారులకు బెయిలు రాని విధంగా కఠిన శిక్షలు పడతాయనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ తరపు న్యాయవాది అనుమతి లేకుండా నేరస్థులు సులువగా బెయిలు పొందలేరని కూడా ఆయన పేర్కొన్నారు.

మార్చిలోగా కుత్తంబాక్కం బస్ టెర్మినల్ సిద్ధం

దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు



కుత్తంబాక్కం బస్‌స్టేషన్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కుత్తంబాక్కంలో సుమారు 25 ఎకరాల్లో రూ.427 కోట్లతో ప్రారంభించిన కొత్త బస్ టెర్మినల్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వచ్చే 2025 మార్చిలోగా ఈ టెర్మినల్ ప్రారంభించనున్నామని సీఎండీఏ ఛైర్మన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుత్తంబాక్కం బస్‌టెర్మినల్ నిర్మాణ పనులను సీఎండీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ... మునుపటి అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ప్రారంభించిన కుత్తంబాక్కం బస్‌టెర్మినల్ నిర్మాణ పనులను అర్ధంతరంగా ఆపివేశారని, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశం మేరకు ఆ పనులను పూర్తి చేయడానికి డీఎంకే ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. డీఎంకే అధికారంలో ఉన్నప్పుడల్లా ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు, కొత్త బస్ టెర్మినళ్లు నిర్మించడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో నిర్మించిన కోయంబేడు బస్‌స్టేషన్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించిన కీలంబాక్కం బస్ టెర్మినల్ సకల సదుపాయాలు కలిగిన బస్‌స్టేషన్లుగా పేరుగడించాయని చెప్పారు. మహాబలిపురం బస్టాండు, చెంగల్పట్టు బస్టాండు కూడా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నాయని చెప్పారు. ఆ కోవలోనే మునుపటి అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన కుత్తంబాక్కం బస్‌టెర్మినల్ నిర్మాణ పనులను గత మూడేళ్లుగా చేపడుతున్నామని చెప్పారు. ఈ బస్ టెర్మినల్‌లో 1800 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ బస్‌టెర్మినల్ ప్రారంభమైన తర్వాత నగరంలో వాహనాల రద్దీ బాగా తగ్గిపోతుందని తెలిపారు. కుత్తంబాక్కం బస్ టెర్మినల్‌లో కొత్తగా కొన్ని సదుపాయాలు కల్పించాలని నగరాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, పూందమల్లి శాసనసభ్యుడు కృష్ణసామి, మాజీ మంత్రి నాజర్ చేసిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం మరిన్ని నిధులతో నిర్మాణ పనులు కొనసాగిస్తోందని చెప్పారు. వచ్చే యేడాది మార్చిలోగా ఈ బస్‌టెర్మినల్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ బస్‌టెర్మినల్ నుండి ధర్మపురి, హోసూరు, బెంగళూరు, తిరుపతి ప్రాంతాలకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులను నడుపుతామని తెలిపారు.

రెండు ఘటనల్లో నీటమునిగి ముగ్గురి మృతి



గల్లంతైన సంతోష్ కోసం గాలిస్తున్న దృశ్యం

వేలూరు, జూలై 13: జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో నీటమునిగి ముగ్గురు మృతి చెందారు. తిరువలం సమీపం రామ నాథపురానికి చెందిన వెంకటేశన్‌కు రాజా (10), శ్రీకాంత్(8) అనే కుమారులున్నారు. వీరివురు అదే ప్రాంతం లోని ప్రభుత్వ పాఠశాలలో 5,3వ తరగతులు చదువుతున్నారు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలసి సమీపంలోని ఏర్వంతాంగల్ చెరువుకు స్నానాలకు వెళ్లారు. వీరు స్నానం చేస్తుండగా రాజా, శ్రీకాంత్ అడుగున బురదలో చిక్కుకుపోయారు. గమనించిన స్నేహితులు పెట్టిన కేకలు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని నీటమునిగిన ఇద్దరి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై తిరువలం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే వేలప్పాడి శాస్త్రినగర్‌కు చెందిన సెంథిల్ (14) చెరువులో స్నానం చేస్తూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగి మరణించాడు.

రెండంతస్థుల మిద్దె నుంచి దూకి ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి కూతవేటు దూరంలో ఉన్న కాలేజీలో చదువుతూ హాస్టల్‌లో బస చేయడానికి తల్లిదండ్రులు అనుమతించలేదనే కోపంతో ఇంజనీరింగ్ విద్యార్థిని రెండంతస్థుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. రామాపురం వళ్లువర్‌రోడ్డులో బృహదీశ్వరన్, సంతానప్రియ దంపతులు నివసిస్తున్నారు. బృహదీశ్వరన్ చిదంబరం అన్నామలై యూనివర్శిటీలో ప్రొఫెసర్. వీరికి అశ్వందిని, ఆనందిని కుమార్తెలు. అశ్వందిని ఆ ప్రాంతంలోనే ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అశ్వందిని చెల్లెలు ఆనందినికి వేలూరులో ఉన్న కళాశాలలో డిగ్రీ కోర్సులో అడ్మిషన్ లభించింది. దీంతో ఆమె హాస్టల్‌లో బస చేయడానికి సిద్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న అశ్వందిని తనను కూడా రామాపురం కాలేజీ హాస్టల్‌లో చేర్పమంటూ పట్టుబట్టింది. ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న కాలేజీలో చదివేందుకు హాస్టల్ ఎందుకని తల్లిదండ్రులు ఆమెను కసురుకున్నారు. దీంతో రెండు రోజులుగా విరక్తితో గడిపిన అశ్వందిని శుక్రవారం రాత్రి 11.30 గంటలకు ఆ ఇంటి రెండో అంతస్థుపైకి వెళ్లి దూకి ఆత్మహత్య చేసుకుంది. రామాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



వేలూరు ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జరిగిన గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

31 విమాన సేవలకు అంతరాయం

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో భారీగా వర్షం కురవడంతో 31 విమాన సేవలకు తీవ్ర అంతరాయం తలెత్తింది. మీనంబాక్కం జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల రన్‌వేలపై వర్షపునీరు ప్రవహించడం, వర్షం కారణంగా కొన్ని విమానాలు గంటల తరబడి ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. వాటిలో నాలుగు విమానాలను బెంగళూరుకు మళ్లించారు. మదురై, డిల్లీ, అయోధ్య, లక్నో, కోయంబత్తూరు, హైదరాబాద్, రాంచి, ముంబై, కోళికోడ్, గౌహతి, దుబాయ్, బహ్రైన్, ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వచ్చిన విమానాలన్నీ ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. అదే విధంగా చెన్నై నుంచి బయలుదేరాల్సిన ముంబై, డిల్లీ, కొల్‌కత్తా, కోయంబత్తూరు, మంగళూరు, హైదరాబాద్, బెంగళూరు, కొచ్చిన్, దుబాయ్, బహ్రైన్, కువైట్, దోహా, ఫ్రాంక్‌ఫర్ట్, శ్రీలంకకు వెళ్లే 16 విమానాలు ఆలస్యంగా బయలు దేరాయి. రాత్రి 11 గంటల తర్వాత వాతావరణం కాస్త కుదుటపడటంతో ఆకాశంలో చక్కర్లు కొట్టిన 11 విమానాలు వరుసగా ల్యాండయ్యాయి. అటుపిమ్మట బెంగళూరుకు మళ్లించిన నాలుగు విమానాలు రాత్రి 12 గంటలకు నగరానికి తిరిగి వచ్చి విమానాశ్రయానికి చేరుకున్నాయి.

రామేశ్వరంలో భక్తుల రద్దీ



చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం రామేశ్వరం లో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. రెండు రోజులు వారాంతపు సెలవులలో రామేశ్వరం ఆలయంలోని పర్వతవర్ధిని సమేత రామనాథ స్వామిని దర్శించు కునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు శనివారం వేకువజామునే తరలివచ్చారు. అదే విధంగా రామేశ్వ రం ఆలయ సమీపంలోని అగ్ని తీర్థంలో స్నానమాచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఆలయం వద్ద కూడా తీర్థబావులవద్ద, క్యూలైన్లలో వందల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఇక రామేశ్వరం పేయ్‌కరుంబు ప్రాంతంలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం స్మారక మందిరం, ధనుష్కోడి సముద్రతీరం, కోదండరామర్ ఆలయం తదితర ప్రాంతాల్లోనూ శనివారం ఉదయం 10గంటల సమయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది.

విషకాటుకు 4,544 మంది మృతి

ఐసిఎఫ్, జూలై 13: రాష్ట్రంలో ఏడాదిలో విషకాటు కు 1.03 లక్షల మంది గురికాగా, వారిలో 4,544 మంది మృతి చెందినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. పాములు, తేళ్లు, కుక్కల కాటుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిని అడ్డుకొనేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో విషకాటు చికిత్సలు అందిస్తున్నారు. ఇందుకోసం విషం విరు గుడు మందులు అన్ని ఆసుపత్రుల్లో సరిపడా నిల్వలుంచాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు విష కీటకాలు, తేళ్లు, పాములు, తేనెటీగలు, కుక్కల దాడులకు 1,03,253 మంది గురై ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. వారిలో 4,544 మంది మృతిచెందారు.

తిరుమల క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసిన ఇద్దరిపై కేసు నమోదు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఇద్దరిపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనం కోసం నారాయణగిరి షెడ్‌లోని కంపార్టుమెంట్‌లో భక్తులు వేచివున్న సందర్భంలో ఓ యువకుడు తాళాలు తీస్తున్నట్టు నటించగా భక్తులందరూ తాళాలు తీస్తున్నారనే భ్రమలో పైకిలేచి గోవిందనామస్మరణలు చేశారు. ఈ లోగా ఆ యువకుడు వెకిలినవ్వులతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దృశ్యాలను 'టీటీఎఫ్ ఫ్యామిలీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో పోస్ట్ చేయగా, ఈ ప్రాంక్ వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయంలో 11వ తేదీన మీడియాలో రావడంతో టీటీడీ స్పందిస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టీటీడీ సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు టీటీఎఫ్ పేజ్‌ను నడుపుతున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన వి.వైకుంఠవాసన్, అతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామి అనే యువకులపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, ప్రాంక్ వీడియో చేసిన వ్యక్తుల కోసం ఓ బృందం తమిళనాడుకు వెళ్లింది. తొలత వైకుంఠ వాసన్, గోవిందరాజస్వామిని అదుపులోకి తీసుకుని ఆ తర్వాత ప్రాంక్ వీడియో చేసిన మిగిలినవారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు భద్రతాధికారులు ప్రయత్నిస్తున్నారు.

వీడియో తీసినందుకు క్షమించండి: వాసన్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియో ఉంటే తనను క్షమించాలంటూ ప్రాంక్ వీడియో పోస్ట్ చేసిన పేజ్ క్రియేటర్ వాసన్ శనివారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. తాను తన స్నేహితులతో కలిసి భక్తిభావంతోనే తిరుమలకు వచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలోకి ఫోన్ తీసుకెళ్లానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందు తమ సెల్‌ఫోన్లను డిపాజిట్ చేశామన్నారు. అయితే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందున్న నారాయణగిరి షెడ్లలో తమ స్నేహితులతో సరదాగా ఓ వీడియో చేశామని, ఈ వీడియో తప్పుగా ప్రజల్లోకి వెళ్లిపోయిందన్నారు. నిజానికి అది ప్రాంక్ కాదని, తాము కంపార్టుమెంట్లలో వేచిఉన్నప్పుడు కొందరు ఉద్యోగులు తాళాలు తీస్తున్నట్టు దగ్గరకు వచ్చి వెళ్లిపోయారని, దాన్నే తాము సరదాగా రీక్రియేట్ చేశామని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. కానీ వీడియో చాలా తప్పుగా వైరల్ అయ్యిందని, ఈ వీడియో వల్ల ఎవరి మనసైనా కష్టపడి ఉంటే క్షమించాలని కోరాడు. కులాలు, మతాలపై తమకు ఆసక్తి లేదని, అందులో భాగంగానే ఇతర మతానికి చెందిన తనస్నేహితుడు అజీస్ కూడా స్వామి దర్శనానికి వచ్చాడని తెలిపాడు.



వీడియోలో మాట్లాడుతున్న వాసన్

అవయవదాతకు కలెక్టర్ నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అరుణ, ఆసుపత్రి డీన్ సీతాంజలి తదితరులు



అవయవదాత ఎమిలి (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూలై 13: అవయవాల దానంతో ఆరుగురికి పునర్జన్మ ప్రసాదించిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో నివాళి అర్పించారు. నీలగిరి జిల్లా ఊటీ మేరిస్‌హల్ ప్రాంతానికి చెందిన ఎమిలి(63) అనారోగ్యంతో ఊటీ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో చేరారు. చికిత్సలు ఫలించక ఆమె మెదడు నిర్జీవమైందని వైద్యులు తెలిపారు. దీంతో, ఎమిలి అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో, శస్త్రచికిత్స ద్వారా కళ్లు, మూత్రపిండాలు, కాలేయాలను కోయంబత్తూర్‌లోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో అవయవమార్పిడి కోసం ఎదురుచూస్తున్న వారికి అమర్చారు. జిల్లాలో అవయవదానం చేసిన మొదటి వ్యక్తిగా ఎమిలి నిలిచింది. ఆమె పార్థివదేహానికి కలెక్టర్ అరుణ, ఆసుప్రతి డీన్ సీతాంజలి, ప్రాంతీయ వైద్యాధికారి రవిశంకర్, సహాయ ప్రాంతీయ వైద్యాధికారులు వినోద్‌కుమార్, మణికంఠన్, అనస్థటిస్ట్ కార్తీక్, ఊటీ తహసీల్దార్ శరవణకుమార్, వైద్యులు, నర్సులు, సిబ్బంది నివాళి అర్పించారు.

వైద్యుడి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 13: భార్య మృతి తట్టుకో లేని వైద్యుడు, గ్లూకోజ్ బాటిల్‌లో విష ఇంజ క్షన్ వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సేలం పట్టైవారి గార్డెన్‌కి చెందిన ఇనియవన్ (33) తెన్‌కాశి జిల్లా కలింగపట్టిలోని ప్రభుత్వ ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడు. ఆయనకు సేలం అమ్మాపేట కడలూరు రోడ్డుకు చెంది సౌమ్యంతో గత ఏడాది నవంబరులో వివాహమైంది. ఇనియవన్ వైద్య శిక్షణకు ఆరు నెలలు పొరుగూరికి వెళ్లాల్సి రావడంతో, సౌమ్యను సేలంలోని తల్లి ఇంటికి వెళ్లాలని సూచించాడు. అందుకు అమె అంగీకరించకపోవడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగినట్టు సమాచారం. దీంతో, ఈ నెల 7వ తేది సౌమ్య తన గదిలో ఫ్యాను ఉరేసుకుంది. భార్య మృతితో మనస్తాపం చెందిన ఇనియవన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు అతనిని శంకరన్‌కోయిల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సల అనంతం శుక్రవారం డిశ్చార్జి అయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో ఉన్న ఇనివయన్, గ్లూకోజ్ బాటిల్‌లో విషపు ఇంజక్షన్ వేసుకొని దానిని శరీరంలోకి ఎక్కించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కంటైనర్ బెల్ట్ తెగి లారీ డ్రైవర్ మృతి

● ఎన్నూర్‌లో కార్మికుల ధర్నా

ప్యారీస్, జూలై 13: ఉత్తర చెన్నై ఎన్నూర్ కామరాజర్ ఓడరేవులో కంటైనర్ బెల్ట్ తెగిపడి లారీ డ్రైవర్ మృతి చెందడాన్ని ఖండిస్తూ సహ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ఓడరేవులో పలు ప్రైవేటు సంస్థలు కంటైనర్ల లోడింగ్ అన్‌లోడింగ్, బొగ్గు, కార్లు, ద్విచక్రవాహనాలు, పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, మందులు తదితరాలను కంటైనర్లలో ఎగుమతి, దిగుమతి చేస్తున్నాయి. శనివారం ఉదయం అదానీ సరుకుల టెర్మినల్‌లో ఖాళీ కంటైనర్లను లారీ డ్రైవర్ నాగరాజ్ అన్‌లోడ్ చేస్తుండగా కంటైనర్లపై బెల్ట్ తెగిపడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న మీంజూరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. నాగరాజ్ మృతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మికులు కామరాజర్ ఓడ రేవులో తమకు సరైన భద్రత కల్పించలేదంటూ ధర్నా నిర్వహించారు.

ఎన్‌ఎల్‌సీ సీఎండీకి పురస్కారం



ప్రసన్న కుమార్

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్' (ఎన్‌ఎల్‌సీ) ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లికి 'జియో మైన్‌టెక్ ఇంటర్నేషనల్ సింపోజియం' సంస్థ 'ఉత్తమ సీఈవో కార్పొరేట్ మేనేజ్‌మెంట్ ఇన్నోవేటివ్ లీడర్షిప్ ఎక్స్‌లెన్స్ అవార్డు' ప్రదానం చేసింది. ఆ సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందించింది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన ప్రసన్నకుమార్.. ఎన్‌ఎల్‌సీలో సానుకూల దృక్పథాన్ని సృష్టించారు. ఆయన నేతృత్వంలో సంస్థ గనుల కోసం భూసేకరణ, సుస్థిరత తదితరాల్లో పురోగతి సాధించింది. ఆయన చొరవ వల్లనే ఎన్‌ఎల్‌సీ నైవేలిలోని మైనింగ్ ఔట్ ల్యాండ్‌లో 50 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా గని ఇంధన అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ఈ పురస్కారాన్ని ఎన్‌ఎల్‌సీ బృందానికి అంకితమిస్తున్నట్లు ప్రసన్నకుమార్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యా హక్కు చట్టంపై సదస్సు



పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూలై 13: తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం, కళా కారులు సంఘం 50వ వార్షికోత్సవం స్థానిక కాట్పాడిలో జరిగింది. ఈ సందర్భంగా, 'భారత రాజ్యాంగం - రాష్ట్రాల విద్యాహక్కు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఏలుతోలియన్ అధ్యక్షత వహించగా, తమిళనాడు సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అముద, సెక్రటరీ జనార్దనన్ యువజన విభాగం డివిజన్ సెక్రటరీ నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్స్ రచించిన పుస్తకాన్ని అతిథులు, నిర్వాహకులు విడుదల చేశారు.

కావేరి జలాల పంపిణీ సమస్యను పరిష్కరించండి

● డీపీఐ ఎంపీ తిరుమావళవన్

ప్యారీస్, జూలై 13: తమిళనాడు - కర్ణాటక రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి కొలిక్కిరాని కావేరి జలాల పంపిణీ సమస్య పరిష్కరింపజేసేలా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డీపీఐ ఎంపీ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. కావేరి జల పంపిణీ వ్యవహారాన్ని రాజకీయంగా చూడకుండా రైతుల సంక్షేమార్థం ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి ఈ నెల 31వ తేది వరకు రోజుకు టీఎంసీ చొప్పున నీటిని విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. జల సమస్యను శాశ్వతంగా పరిష్కరింపజేసేలా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు బాంబు బెదిరింపు : ఒకరి అరెస్టు

వేలూరు, జూలై 13: బాగాయం పోలీస్‌స్టేషన్‌లో బాంబు బెదిరింపుకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. 100 నెంబరుకు ఫోన్ చేసిన అజ్ఞాత వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో బాంబు ఉంచినట్లు పేర్కొని ఫోన్ కట్ చేశాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు చేపట్టి బాంబు బెదిరింపు కవ్వింపు చర్యగా గుర్తించారు. ఈ నేపథ్యంలో, బాగాయం బస్టాండ్ వద్ద సందేహా స్పదంగా ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, బాంబు బెదిరింపు పాల్పడింది అతనేనని గుర్తించారు. అతను కృష్ణగిరి జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్(28)అని విచారణలో నిర్ధారించారు.

చిత్ర దర్శకుడు రవి శంకర్ ఆత్మహత్య



అడయార్, జూలై 13: కోలీవుడ్‌లో విషాదం నెలకొంది. చిత్ర దర్శకుడు రవిశంకర్(63) ఆత్మహత్య చేసుకున్నారు. అవివాహితుడైన రవిశంకర్.. స్థానిక కేకే నగర్‌లోని స్వగృహంలో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, భారతీరాజా కుమారుడు మనోజ్ - కునాల్ జంటగా నటించిన 'వరుష మెల్లాం వసంతం' చిత్రానికి దర్శకత్వం వహించారు. సీనియర్ దర్శకుడు కె.భాగ్యరాజ్, విక్రమన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన రవిశంకర్.. 2002లో దర్శకుడిగా వెండితెరకు పరిచమయ్యారు. విక్రమన్ దర్శకత్వం వహించిన 'సూర్యవంశం' సినిమాలోని 'రోసాప్పూ చిన్న రోసాప్పూ', 'వరుషమెల్లాం వసంతం' మూవీలోని 'ఎంగే అంద వెన్నిలా' వంటి అనేక సూపర్ హిట్ పాటలను రచించారు. అంత కుముందు 'భాగ్య' అనే వార పత్రికలో ప్రచురితమైన 'గుదిరై' అనే షార్ట్‌స్టోరీ ద్వారా పత్రికా రంగంలోకి ప్రవేశించిన ఆయన.. దర్శకుడిగా పెద్దగా సక్సెస్ సాధించలేకపోయారు. వివాహం చేసుకోకుండా కేకే నగర్‌లోని తన నివాసంలోనే ఒంటరిగా ఉంటూ వచ్చిన ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. ప్రతిభ కలిగినప్పటికీ సరైన సినిమా అవకాశాలు లేకపోవడంతో తీవ్ర మనోవేదనకుగురైన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

చిత్రజ్యోతి



'మూక్కుత్తి అమ్మన్'లో నయనతార

మరోమారు 'మూక్కుత్తి అమ్మన్'గా నయనతార

● అధికారికంగా వెల్లడి

సీనియర్ హీరోయిన్ నయనతార మరోమారు 'మూక్కుత్తి అమ్మన్'గా ప్రేక్షకులను అలరించనున్నారు. 2020లో వచ్చిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. కరోనా మహమ్మారి కావడంతో ఈ చిత్రం థియేటర్‌లో కాకుండా ఓటీటీలో విడుదలైంది. అయినప్పటికీ మౌత్ పబ్లిసిటీ కారణంగా అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా నిర్మాతకు కాసుల వర్షం కురిపించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెండో భాగాన్ని తెరకెక్కించనున్నట్టు నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. తొలి భాగంలో నయనతార ప్రధాన పాత్రను పోషించగా, ఆర్జే బాలాజీ, ఊర్వశి, స్మృతి వెంకట్, మయిల్‌స్వామి ముఖ్య పాత్రలను పోషించారు. క్రిష్ సంగీతం అందించగా, డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో రిలీజ్ చేశారు. ఇపుడు రెండో భాగంలో నటించే నటీనటుల పేర్లను ఇంకా అధికారికంగా వెల్లడించనప్పటికీ... తొలి భాగంలో నటించిన వారే నటించవచ్చని కోలీవుడ్ వర్గాల సమాచారం.



కమల్‌తో సీమాన్

నా ఆలోచనలే 'ఇండియన్-2' మూలకథ

● సీమాన్

గతంలో పలు సందర్భాల్లో తాను వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆలోచనలే 'ఇండియన్-2' మూల కథ అని నామ్ తమిళర్ కట్చి కన్వీనర్, సినీ దర్శకుడు సీమాన్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో విశ్వనటుడు కమల్ హీరోగా నటించిన 'ఇండియన్-2' చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదలైంది. ఈ సినిమా తమిళ వెర్షన్‌ను నగరంలోని సత్యం థియేటర్‌లో హీరో కమల హాసన్‌తో కలిసి సీమాన్ వీక్షించారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'ఈ సినిమా తొలి భాగంలో సేనాపతి తాత వచ్చి సమాజంలోని సమస్యలను పరిష్కరిస్తాడు. రెండో భాగంలో నీ సమస్యలను నువ్వే పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకుంటే దేశం పరిశుభ్రంగా ఉంటుందని చెప్పారు. లంచం, అవినీతి ఇష్టంలేకుంటే ధైర్యంగా వ్యతిరేకించాలి. ఇండియన్ తాత, శ్రీకృష్ణుడు, మహ్మద్ ప్రవక్త, ఏసుక్రీస్తు వంటి వారు వచ్చి అన్యాయాన్ని తట్టిలేపుతారని ఎదురు చూసేబదులు మీరే సమస్యను పరిష్కరించుకోవాలి. ఈ సినిమా కథాంశం కొన్నాళ్ళుగా బయట ప్రపంచంలో నేను మాట్లాడుతున్న అంశమే. అందుకే కమల్ హాసన్ ఫోన్ చేసి ఈ సినిమా చూడమన్నారు. గతంలో నేను మాట్లాడిన వ్యాఖ్యలు మొత్తం ఈ సినిమాలో ఉన్నాయి. ఆ తర్వాత 'ఇండియన్-3'లో ఉంటాయి. ఒక మంచి సందేశంతో సినిమాను తెరకెక్కించిన దర్శక హీరోలకు అభినందనలు' అని పేర్కొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే కానుకగా 'నన్బన్ ఒరువన్ వంద పిరగు'

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 2వ తేదీన 'నన్బన్ ఒరువన్ వంద పిరగు' మూవీ విడుదలకానుంది. ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు సమర్పణలో తెరకెక్కిన ఈ చిత్రం స్నేహం గొప్పతనాన్ని వివరించే విధంగా రూపొందించారు. వైట్ ఫెదర్స్ స్టూడియోస్‌తో కలిసి నిర్మాత ఐశ్వర్య మసాలా పాప్‌కాన్ బ్యానరుపై నిర్మించారు. ఈ సినిమా విడుదల తేదీని వెంకట్ ప్రభు తాజాగా తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'స్నేహం అనేది భూమిపై ఉన్న ప్రతి వ్యక్తి అందించే గొప్ప బహుమతి. ఒక మనిషి వ్యక్తిగత, వృత్తి జీవితాల్లో తన స్నేహితుల ప్రాముఖ్యాన్ని వివరిస్తాడు. ఈ సినిమా రూపుదిద్దుకోవడం వెనుక పలువురు స్నేహితుల సహకారం ఉంది. స్నేహం కోసమే ఈ చిత్ర బృందంతో చేతులు కలిపాను. స్నేహానికి సంబంధించిన సారాంశంతో ఈ సినిమాను తెరకెక్కించినందుకు చాలా సంతోషంగా ఉంది' అని వెంకట్ ప్రభు కామెంట్స్ చేశారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని రిలీజ్ కానున్న ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటుందని ఆయన పేర్కొన్నారు.



'నన్బన్ ఒరువన్ వంద పిరగు'లో ఓ దృశ్యం

మిర్చి విజయ్ 'వైఫ్' షూటింగ్ పూర్తి

ఆర్.హేమనాథ్ దర్శకత్వంలో మిర్చి విజయ్ కథానాయకుడిగా నటించిన 'వైఫ్' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఒలింపియా మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్.అంబేత్ కుమార్ నిర్మించారు. గత యేడాది 'డాడా' పేరుతో నిర్మించిన సినిమా వినోదాత్మకంగా, వాణిజ్యపరంగా విజయం సాధించింది. ఇపుడు 'వైఫ్' పేరుతో నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇందులో అంజలి నాయర్ హీరోయిన్‌గా నటించగా, జెన్ మార్టిన్ సంగీతం. మైత్రేయన్, రెడిన్ కింగ్‌స్లీ, అభిషేక్ జోసెఫ్, కళ్యాణి నటరాజన్, విజయ్ బాబు, లల్లూ, కదిర్ తదితర తారాగణం నటించారు. సినిమా షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన శుభ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. షూటింగ్ పూర్తి చేసుకోవడంతో డబ్బింగ్ పనులను ప్రారంభించనున్నారు. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులన్నీ నిర్ణీత సమయంలో పూర్తి చేసి అనుకున్న ప్రకారం విడుదల చేయాలని భావిస్తున్నారు. ట్రైలర్, ఆడియో విడుదల వేడుకలను త్వరలో నిర్వహించనున్నారు.



'మిర్చి' మూవీ యూనిట్ బృందం

ఘనంగా ఆంధ్ర కళా స్రవంతి సభ్యుల డైరెక్టరీ ఆవిష్కరణ



డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న డాక్టర్ బీఎస్ గుప్తా

ప్యారీస్, జూలై 13: స్థానిక కొరట్టూరు అగ్రహారంలోని ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో 2024వ సంవత్సరం సభ్యుల డైరెక్టరీ ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం 6 గంటలకు ఘనంగా జరిగింది. స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఛార్టెడ్ ఇంజనీర్ డాక్టర్ బీఎస్ గుప్తా పాల్గొని డైరెక్టరీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సలహాదారులు ఎంఎస్ మూర్తి, కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, ఉపాధ్యక్షులు కేఎస్ సురేష్‌బాబు, వీఎస్ హరినాథ్, సరస్వతి, ఇతర సభ్యులు పాల్గొని డైరెక్టరీ అందుకున్నారు. ఈ సందర్భంగా జేఎం నాయుడు మాట్లాడుతూ... ఆంధ్ర కళా స్రవంతి తరపున ప్రతి రెండేళ్లకోసారి సభ్యుల డైరెక్టరీ ముద్రించి ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే 2024వ సంవత్సరానికి ముద్రించిన డైరెక్టరీని బీఎస్ గుప్తా చేతుల మీదుగా ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సభ్యుల వివరాలు, చిరునామా, ఫోన్ నెంబర్లతో కూడిన ఈ డైరెక్టరీ సభ్యులందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం 250 మంది పేదలకు అన్నదానం చేశారు. స్రవంతి చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, సంస్థ అభివృద్ధికి తన వంతుగా సహాయపడతానని ముఖ్యఅతిథి గుప్తా హామీ ఇచ్చారు.

షిబౌరా మెషిన్ ఇండియా కొత్త ఫ్యాక్టరీ ప్రారంభం



కొత్త ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

ప్యారీస్, జూలై 13: షిబౌరా మెషిన్ ఇండియా రూ.225 కోట్ల పెట్టుబడితో చెంగల్పట్టు జిల్లా చెంబరంబాక్కంలో కొత్త ఫ్యాక్టరీ నిర్మించింది. ఈ సంస్థ ఛైర్మన్, సీఈఓ సిటో మోస కామిటో, డైరెక్టర్ హిరోషి ఓటా, చెన్నై ప్రాంతీయ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కుమార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. తమ వార్షిక తయారీ సామర్థ్యాన్ని, ఉత్పత్తిని మూడింతలు పెంచే దిశగా చెంబరంబాక్కంలో కొత్త ఫ్యాక్టరీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆప్టికల్ గ్లాస్ మోడ్ క్రష్ మెషిన్లు, ఇండస్ట్రియల్ రోబోట్లు, ఎలక్ట్రానిక్ కంట్రోలింగ్ సిస్టం, క్యాస్టింగ్ తయారీపై ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న టెన్త్, ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ పథకం కింద ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.







ఆధునిక తాంబరం రైల్వే స్టేషన్ నమూనా చిత్రాలు

తాంబరం రైల్వే స్టేషన్‌కు హైటెక్ సొబగులు



● రూ.1000 కోట్లతో ఆధునికీకరణ

● నమూనా చిత్రాలు విడుదల చేసిన దక్షిణరైల్వే

(అడయార్)

చెన్నై మహానగరంలో అతి ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో తాంబరం ఒకటి. చెన్నై సెంట్రల్, ఎగ్మోర్ తర్వాత మూడో అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా అవతరిస్తోంది. దక్షిణాది జిల్లాల నుంచి వచ్చే రైళ్ల రాకపోకలకు ప్రవేశద్వారంగా ఉంది. రాష్ట్రంలోని అన్ని దక్షిణాది జిల్లాలకు వెళ్లే ప్రతి రైలూ ఈ స్టేషన్‌ను దాటాల్సిందే. చెన్నై బీచ్ - తాంబరం ప్రాంతాల మధ్య ప్రతి రోజూ వందల సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ రైళ్లలో వేలాదిమంది నగరవాసులు ప్రయాణిస్తున్నారు. అలాంటి రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రైల్వే స్టేషన్‌ను రూ.వెయ్యి కోట్లతో ఆధునికీకరించాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఇప్పటికే లిఫ్ట్, ఎస్కలేటర్, పోలీస్ స్టేషన్ వంటి సౌకర్యాలను కల్పించారు. ఇపుడు మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. రైల్వే స్టేషన్ లోపలి ప్రదేశాలతో పాటు బయట ప్రాంతాన్ని కూడా ఆధునకీరించనున్నారు. ఈ పనులన్నీ పూర్తయిలో ఈ రైల్వే స్టేషన్ ఏ విధంగా ఉంటుంతో తెలిపే నమూనా చిత్రాలను దక్షిణ రైల్వే తాజాగా విడుదల చేసింది.

కీలక రైల్వే స్టేషన్‌గా...

ప్రస్తుతం నగరంలో తాంబరం కీలక ప్రాంతంగా ఉంది. దీంతో ఇక్కడ నుంచి రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా, ఉత్తర భారతం నుంచి రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాలకు వెళ్లే అన్ని రైళ్లు చెన్నై ఎగ్మోర్, చెన్నై తాంబరం స్టేషన్లు మీదుగానే వెళుతున్నాయి. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు వచ్చే రైళ్ల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఇక్కడకు వచ్చే అనేక రైళ్లను తాంబరానికి మార్చారు. అలాగే, ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే అనేక రైళ్లు కూడా ఇక్కడ నుంచే ఆరంభమవుతున్నాయి. అదేవిధంగా రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాలు లేదా ఉత్తరాది రాష్ట్రాలకు నడిపే కొత్త రైళ్లను కూడా చెన్నై తాంబరం నుంచే బయలుదేరి వెళ్లేలా దక్షిణ రైల్వే చర్యలు తీసుకుంది. అలాంటి రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు దక్షిణ రైల్వే నడుం బిగించింది. ఇందుకోసం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది.

ఐటీ కంపెనీగా సుందరీకరణ పనులు...

ఈ రైల్వే స్టేషన్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అనేక సౌకర్యాలను కల్పించనున్నారు. ముఖ్యంగా, మరుగుదొడ్లు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, ఎస్కలేటర్లు, వేళచ్చేరి, జీఎస్టీ రోడ్డుకు ఇరువైపుల స్టేషన్‌కు ప్రయాణికులు సులభంగా వచ్చి వెళ్లేలా ప్రవేశద్వారాలు, కారులు, ద్విచక్రవాహనాల పార్కింగ్, ప్లాట్‌ఫాంలపై ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, అధిక వెలుతురునిచ్చే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయనున్నారు. రైల్వే స్టేషన్‌కు వాహనాలు వచ్చి వెళ్ళేందుకు వీలుగా విశాలమైన ముఖద్వారాలను నిర్మించనున్నారు. ఈ రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయి ఒక ఐటీ కంపెనీ తరహాలో సుందరీకరించనున్నారు. ఇందుకోసం దక్షిణ రైల్వే విడుదల చేసిన నమూనా చిత్రాలు కూడా ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



రసరమ్యంగా రేష్మి శుభశ్రీ భరతనాట్య అరంగేట్రం





రేష్మి శుభశ్రీని అభినందిస్తున్న డాక్టర్ సుబ్బారెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సునీల్, రవీంద్రనాథ చౌదరి తదితరులు - రేష్మి శుభశ్రీ అభినయం

ప్యారీస్, జూలై 13: స్థానిక టి.నగర్ వాణిమహాల్‌లో భరత నాట్యాలయ 185వ భరతనాట్య అరంగేట్రంలో నర్తకి రేష్మి శుభశ్రీ అరంగేట్రం అలరించింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నటరాజస్వామి, విఘ్నేశ్వరులను కీర్తిస్తూ ఆది తాళం, అరబి రాగంలో ఆలపించిన పుష్పాంజలి కీర్తనతో ప్రారంభమైన నాట్యోత్సవంలో వర్ణం, భో శంభో, బ్రహ్మ మొక్కటే తదితర కీర్తనలతో సాగి తిల్లానాతో ముగిసింది. అన్నానగర్‌లోని భరత నాట్యాలయ డైరెక్టర్, గురువు కలై చూడామణి లత రవి సమక్షంలో రేష్మి భరతనాట్య అరంగేట్రం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.భవాని సుబ్బరాయన్, ఆత్మీయ అతిథులుగా హాజరైన ప్రముఖ నటి ఈశ్వరీరావు, భరతనాట్య కళారత్న డాక్టర్ రత్నసుబ్రమణ్యం, ఆస్కా అధ్యక్షుడు డా.కె.సుబ్బారెడ్డి, ఉంగుళుక్కాగ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ సునీల్, పారిశ్రామికవేత్త అనీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ రవీంద్రనాథ చౌదరి, కూచిపూడి కళాకారుడు మాధవపెద్ది మూర్తి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలో స్థిరపడిన తెలుగు ప్రముఖులు చిట్టూరి శ్రీధర్ - శైలజా రాణి దంపతుల కుమార్తె రేష్మి శుభశ్రీ అన్నానగర్‌లో ఉన్న చెన్నై పబ్లిక్ పాఠశాలలో ప్లస్ వన్ చదువుకుంటోంది. ఆమె తన నాల్గో ఏట నుంచే గురువు లత రవి వద్ద భరతనాట్యంపై శిక్షణ పొందుతూ అందులోని మెలకువలు నేర్చుకొని అంచెలంచెలుగా ఎదిగి అరంగేట్రం ప్రదర్శించి ప్రముఖులు, కుటుంబ సభ్యులు, కళాకారుల ప్రశంసలందుకుంది. రేష్మి నృత్యానికి నట్టువాంగంపై ఆర్.వనమాలిక, టీహెచ్ త్యాగరాజన్ (గాత్రం), ధనుంజయన్ (మృదంగం), వి.శంకర్ (వయొలిన్), జి.నటరాజ్ (ఫ్లూట్), కృష్ణ కొలోత్ స్పెషల్ ఎఫెక్ట్స్‌తో వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కళాకారులను చిట్టూరి దంపతులు జ్ఞాపికలు బహూకరించి ఘనంగా సత్కరించారు. రేష్మిని అభినందిస్తూ జస్టిస్ భవాని సుబ్బరాయన్ మాట్లాడుతూ... చిన్నారి హావాభావాలు, నృత్య భంగిమలు చూడముచ్చటగా ఉన్నాయని, రేష్మి నెమలిలా నర్తించి భరతనాట్యంలోని నైపుణ్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. అనంతరం రత్న సుబ్రమణ్యం మాట్లాడుతూ... అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించేలా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నటి ఈశ్వరీరావు మాట్లాడుతూ... గురువు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, సీనియర్ కళాకారుల ఆశీస్సుల వల్లే రేష్మి భరతనాట్య కళాకారిణిగా రాణించగలుగుతోందని పేర్కొన్నారు.

సేర్వలారు డ్యాంలో ఒకే రోజు 7 అడుగులకు పెరిగిన నీటిమట్టం





సేర్వలారు డ్యాం - కుట్రాలం జలపాతం వద్ద పర్యాటకుల సందడి

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పడమటి కనుమలలో కుండపోత వర్షాలు కురువటంతో సేర్వలారు డ్యాంలో ఒకే రోజు నీటి మట్టం ఏడడుగులకు పెరిగింది. తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాల్లో గత కొద్ది రోజులుగా చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయి. తిరునల్వేలి జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం వరకు మండుటెండలు ప్రజలను చెమటవర్షంతో తడిసేలా చేశాయి. మధ్యాహ్నం తర్వాత ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీగా వర్షాలు కురిశాయి. ఇదే విధంగా పడమటి కనుమలను ఆనుకుని ఉన్న పాపశానం, సేర్వలారు, మణిముత్తారు జలాశయాల పరివాహక ప్రాంతాల్లోనూ శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకు కుండపోతగా వర్షాలు కురిశాయి. పాపనాశం డ్యాంలో ప్రస్తుతం సెకనకు 2649 అడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. ఆ డ్యాంలో నీటిమట్టం 102 అడుగుల నుంచి 104.10 అడుగులకు పెరిగింది. సేర్వలారు డ్యాంలో నీటమట్టం 113 అడుగుల నుంచి 120 అడుగులకు పెరిగింది. ఇలా ఒకే రోజు ఆ డ్యాంలో ఏడు అడుగుల దాకా నీటి మట్టం పెరగటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక మణిముత్తారు డ్యాంలో నీటిమట్టం కూడా 73.85 అడుగులకు పెరిగింది. తెన్‌కాశి జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం నుండే తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం సాయంత్రానికి కుండపోతగా మారింది. దీనితో కడయం సమీపంలో ఉన్న కడనా, రామనది జలాశయాల్లోనూ నీటిమట్టం క్రమంగా పెరిగింది.

కుట్రాలంలో రద్దీ...

తెన్‌కాశి జిల్లాలోని కుట్రాలం జలపాతం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో ఆ జలపాతం వద్ద స్నానం చేయడానికి పర్యాటకులను అనుమతించారు. సెంగోట్టై, పులియర్రై, ఇలంజి, తెన్‌కాశి, పావూరుసత్తిరం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వేకువజాము వరకు వర్షాలు కురిశాయి. దీంతో కుట్రాలం ప్రధాన జలపాతం, పాతకుట్రాలం, ఐందరువి, సిట్రరువి జలపాతాలలో జలధారలు అత్యంత వేగంగాపడుతున్నాయి. ప్రధాన జలపాతం వద్ద నీటి ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టడం పర్యాటకలును ఆ చోట స్నానం చేసేందుకు అధికారులు అనుమతించారు.